క్లుప్తంగా

సురక్షిత సమాజ నిర్మాణానికే 'వారధి'



వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాస్

పిఠాపురం: సురక్షితమైన సమాజాన్ని నిర్మించడానికే వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శనివారం రాత్రి నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాంతి భద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలు, సారా నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

కొత్తపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గ్రామ సర్పంచ్ పాలాని దొరబాబు ఆధ్వర్యంలో నిర్మించిన బస్ షెల్టర్‌ను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ శనివారం ప్రారంభించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, గొండేల లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

ఏలేశ్వరం: విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని అమలాపురం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సిస్టర్ స్వరూపాదేవి సూచించారు. యర్రవరంలోని విజ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాలలో శనివారం కేంద్ర వై 20 క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానసిక వికాసం, ఆధ్యాత్మిక మార్గాలపై దృష్టి సారించాలన్నారు. మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ రమణ, రాజేష్, కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు లిఫ్టును పరిశీలించిన అధికారులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. మరమ్మతుల నిమిత్తం సీఎస్ఆర్ నిధులు రూ.22 లక్షలు విడుదలయ్యాయని తెలిపారు. మరమ్మతులు చేసి త్వరలో నీటిని విడుదల చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయ్‌కుమార్, ఏడీఏ వైవీ గంగాధర్ కుమార్, పుష్కర ఏఈఈ వై.జగదీష్, తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి, సర్వేయర్ డీటీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని సారా స్థావరాలపై శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలంలోని ఉత్తరకంచిలో సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఉత్తరకంచి గ్రామానికి చెందిన విత్తనాల శివపై కేసు నమోదు చేశారు. కేతనగిరి గిరిజన తండాలో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కె.మిర్తివాడకు చెందిన పూజల లోవమ్మ, భూముల సత్యవతిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ ఎస్ఈబీ సీఐ పి.సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, టాస్క్‌ఫోర్స్ సీఐ జె.విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లలో పూడిక తొలగించాలంటూ ధర్నా

కిర్లంపూడి: డ్రైన్లలో పేరుకుపోయిన పూడిక తొలగించాలని కోరుతూ ఏపీఆర్‌సీఎస్ కార్యదర్శి కడితి సతీష్ ఆధ్వర్యంలో శనివారం బూరుగుపూడి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బూరుగుపూడిలోని 6, 7, 8 వార్డుల డ్రైన్లలో పూడిక పేరుకుపోయి మురుగు ముందుకు పారడం లేదన్నారు. డ్రైనేజీల్లోని మురికి నీరు ఇళ్ల మధ్య నిలిచిపోతోందన్నారు. దీంతో దోమలు పేరుకుపోయి అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఎస్‌టీ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

ఉపాధికి చేయూత



పాల డెయిరీ కోసం గేదెల పెంపకం చేస్తున్న వైఎస్సార్ చేయూత లబ్ధిదారు



సామర్లకోటలో కిరాణా వ్యాపారం చేస్తున్న లబ్ధిదారు

- మూడేళ్ల పాటు మహిళలకు ప్రయోజనం
- నాలుగో విడతకు రంగం సిద్ధం
- మున్సిపాలిటీలో 2,870 మందికి లబ్ధి

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్న పథకాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకొన్నాయి. 45 ఏళ్లు నిండిన మహిళలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని ఆదుకోవడానికి ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించడమే కాకుండా మూడేళ్ల పాటు ఆ మొత్తాన్ని అందజేశారు. దీనిలో భాగంగా ఈ నెలలో నాల్గవ విడత సాయం అందనుంది. నాలుగేళ్లలో రూ.75 వేల ఆర్థిక సాయం అందజేయడమే వైఎస్సార్ చేయూత లక్ష్యం కాగా దానిని విజయవంతంగా అమలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 2,870 మంది వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధి పొంది 1,500 మంది వరకు వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారు.

సర్వే చేస్తున్న వలంటీర్లు

45 ఏళ్లు నిండిన మహిళలను వలంటీర్లు గుర్తించి ఈ పథకానికి దరఖాస్తులు చేయిస్తున్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డులను సమర్పించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో మెప్మా అధికారులు, మండల పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందేలా చేస్తున్నారు. లబ్ధి పొందిన మహిళలను మెప్మాలోని ఆర్పీలు, యానిమేటర్లు లబ్ధిదారులను చైతన్య పరచి వ్యాపారాలు చేసుకునేలా చేస్తున్నారు. దీనిలో భాగంగా కిరణా, ఫ్యాన్సీ, గేదెలు, ఆవుల పెంపకం, పాల డెయిరీ వంటి వ్యాపారాలు వైఎస్సార్ చేయూతలో లబ్ధి పొందిన వారు చేస్తున్నారు. వీరికి సరకులు సరఫరా చేయడానికి అమూల్, రిలయన్స్, పీఅండ్‌జీ, ఐటీసీ వంటి సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని వ్యాపారాలు చేసుకొవడానికి ప్రోత్సహిస్తోంది.

అర్హత ఉంటే లబ్ధి



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలలో ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారు 45–60 ఏళ్ల మధ్య వారికి వైఎస్సార్ చేయూత పొందేలా చేస్తున్నాం. లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు తెరిచేలా మెప్మా ఆర్పీలు కృషిచేస్తున్నారు. వ్యాపారాలకు అవసరమైన రుణాలను బ్యాంకుల నుంచి అందజేసేందు కృషి చేస్తున్నాం.

– సుజాత, మెప్మా సిటీ మిషన్ మేనేజర్, సామర్లకోట

జీవనోపాధికి దోహదం

భర్త సంపాదన కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. ఈ సమయంలో వైఎస్సార్ చేయూత తమ కుటుంబం అభివృద్ధికి తోడుగా నిలించింది. మూడేళ్ల పాటు రూ.56,250 లబ్ధి పొందాను. ఆ మొత్తంతో వ్యాపారం చేయదానికి మెప్మా ఆర్పీలు ప్రోత్సహించారు. బ్యాంకు రుణం అందడంతో ఇంటి వద్దనే కిరాణా వ్యాపారం చేసుకొంటూ ఉపాధి పొందుతున్నా.

– పి.పార్వతి, లబ్ధిదారు, సామర్లకోట

వాటర్ ట్యాంక్‌ల శుభ్రం



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రపరుస్తున్న కార్మికుడు

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: గ్రామంలో ప్రజలకు కలుషిత తాగునీరు సరఫరాపై శనివారం 'తాగునీరు కలుషితం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ భాస్కర్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బందికి గ్రామంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. మరమ్మతులు గురైన ప్రధాన పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించారు.



పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: గంజాయి, సారా వంటి మాదక ద్రవ్యాలు, పేకాట, గుండాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సూచించారు. మండలంలోని గుమ్మరేగుల ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు డ్రగ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసులతో మమేకం కావాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్య పరిచారు. ప్రస్తుతం ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటివారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



పిఠాపురంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

పిఠాపురం: పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆయన శనివారం సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. పట్టణంలో పారిశుధ్య సమస్య లేకుండా చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి, కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. ముఖ్యంగా డ్రైన్లు, రోడ్లు తాగునీటి కుళాయిలు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

పలు రోడ్లు, డ్రైన్లు ప్రారంభం

పట్టణంలో పలు రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా అవసరమైన రోడ్లు దఫదఫాలుగా నిర్మించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో 25, 26వ వార్డుల్లో రూ.10 లక్షలతో నిర్మించిన ఫిష్ మార్కెట్ షెడ్‌ను ఆయన ప్రారంభించారు. మిరపకాయల వీధి 10, 11 వార్డుల్లో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, సకలయ్య చెరువు 25వ వార్డులో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, పట్టణ పోలీసు స్టేషన్ ఏరియాలో 18, 19, 23 వార్డుల్లో రూ.33.87 లక్షలతో నిర్మించిన రోడ్లు, గట్ల వీధి 22 వార్డు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 15వ వార్డులో రూ. 19.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైవర్స్ కాలనీలో 8వ వార్డులో రూ.9.95 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అగ్రహారం 1వ వార్డులో రూ.22 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. మునుపెన్నడు లేనంతగా రూ కోట్లు వెచ్చించి పట్టణంలో రోడ్లను అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, బొజ్జా రామయ్య, పచ్చిమళ్ల అప్పలరాజు, వజ్రపు వీరేష్, కొత్తపల్లి బుజ్జి, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే సొంత నిధులు రూ.2 లక్షలతో కాలువల్లో పూడికతీత
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో కాలువల్లో పూడిక తీయిస్తున్న రైతులు

పిఠాపురం: ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో నీటి ఎద్దడి సమస్యకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరిష్కారం చూపించారు. పిఠాపురం నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడిపై ఇటీవల పలువురు రైతులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటిపారుదల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ రాంగోపాల్, డీఈఈ కాశి సురేష్‌లను హుటాహుటిన పిఠాపురం పిలిపించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు, పీబీసీ రైతులకు నీటి ఎద్దడి లేకుండా వెంటనే సాగు నీరు విడుదల చేయాలని కోరారు.

సొంత నిధులతో పనులు

ఎమ్మెల్యే ఆదేశాలతో నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకుని నీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సాగునీరు వస్తున్నప్పటికీ పిఠాపురం మండలం వెల్దుర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం, పి.దొంతమూరు తదితర గ్రామాల్లోని పంట కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సక్రమంగా ఉండడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే యంత్రాల సాయంతో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని రైతులకు సూచించారు. వాటికి అయ్యే ఖర్చు రూ.2 లక్షలు (తన సొంత నిధులు) తాను భరిస్తానని తెలిపారు. దీంతో రైతులు కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే సరికి రైతులు ఇబ్బంది పడతారని ఆలోచించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన సొంత నిధులను రైతుల కోసం ఖర్చు చేయడం పట్ల రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ రైతులు సాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా సాగు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉంటే ఆయా ప్రాంతాలకు యుద్ధప్రాతిపదికన నీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అవసరమైతే తన సొంత నిధులు వెచ్చించి అయినా సాగునీటి సమస్యలు లేకుండా చేస్తానని ఆయన తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ట్యాంకర్



జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద డివైడర్ పైకి దూసుకుపోయిన ట్యాంకర్

ప్రత్తిపాడు: పదహారో నంబర్ జాతీయ రహదారిపై ట్యాంకర్ అదుపు తప్పి, డివైడర్‌పైకి దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై ముంబాయి నుంచి నక్కపల్లికి స్టైరీన్ మోనోమర్ ద్రావణాన్ని తీసుకువెళ్తున్న ట్యాంకర్ స్థానిక మినర్వా పాఠశాల సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వాకతిప్పలో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పవరలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేసిన సర్పంచ్ తదితరులు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువు గట్టుపై గ్రామ సర్పంచ్ పాలని దొరబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక శిలా ఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజుబాబు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్‌డీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నా మట్టి–నా దేశం

సామర్లకోట: నా మట్టి–నా దేశంలో భాగంగా శనివారం మండల పరిధిలో పవర, పండ్రవాడ పంచాయతీల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి మట్టికి ప్రణామం–వీరులకు వందనం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్‌లు వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, ఎంకే శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి

గోకవరం: ఫైర్ సేఫ్టీకి సంబంధించి ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని ఎస్సై శివనాగబాబు సూచించారు. మండలంలోని పెట్రోల్ బంక్‌లు, మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మందుగుండు సామగ్రి తయారు చేయాలన్నారు. పెట్రోల్ బంకుల్లో ఫైర్ సేఫ్టీ పటిష్టంగా ఉండాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై శివనాగబాబు హెచ్చరించారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- విరాళాలు, టిక్కెట్ల ద్వారా రూ.4.43 లక్షల ఆదాయం



శృంగారవల్లభ స్వామి



ఆలయంలో, అన్నదానం వద్ద క్యూ కట్టిన భక్తులు

పెద్దాపురం: స్థానిక శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వర రావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 4,43,079 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకుడు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది స్వామి వారిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

ప్రత్తిపాడు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి శనివారం తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి 3వ అంగన్‌వాడీ కేంద్రలో హెల్పర్ పోస్టును బీసీ–ఎకు, ధర్మవరం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టును ఓసీ (వితంతువు)కు కేటాయించారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి, స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 19వ తేదీలోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

తాటి వంటకం.. తిని తీరాల్సిందే..

- తాటికాయలో పోషకాలు మెండు
- వర్షాకాల వంటకం తాటి బూరెలు
- రుచికరం, ఆరోగ్యప్రదం



తాటిపండుతో తయారు చేసిన దిబ్బరొట్టెలు



తాటి బూరెలు

పెద్దాపురం: తాటిచెట్టును కల్పవృక్షం అంటారన్న విషయం తెలిసిందే. ఆ చెట్టులో పనికిరాని భాగం అంటూ లేదు. ప్రతి భాగమూ ఎన్నో విధాలుగా ప్రజలకు వినియోగపడుతూనే ఉంటుంది. తాటి కాయ విషయానికి వస్తే ముంజెలు, ముగ్గితే పళ్లు, భూమిలో పాతితే మరింత ముదిరాగ బుర్రగుంజు, తరువాత తేగలు ఇలా ఎన్నో రూపాంతరాలై ఎన్నో రుచులు అందిస్తూ ఉంటుంది. తాటి పండు విషయానికి వస్తే కొన్నేళ్ల క్రితం వరకు బాటసారులు తాటి పండుతో కడుపు నింపుకొనేవారు. దానిని కాల్చి గుజ్జు తింటే మరింత రుచికరంగా ఉంటుంది. ఈ గుజ్జుతో తాటి ఇడ్లీలు, బూరెలు, గారెలు, రొట్టె వంటి వంటకాలు పల్లె ప్రాంతాల్లో ఎక్కువగా తయారు చేస్తారు. వర్షాకాలంలో సీజనల్ వంటగా తాటి బూరెలు తినడం పరిపాటి.

ఈ తాటిపండు ఉచితమే

సీజనల్‌గా దొరికే తాటిపండు ఎక్కడైనా ఉచితంగానే దొరకుతుంది. ఈ పండు కనబడితో అవితీసుకోక పోయిన ఒక్కసారి వాసన చూడగల్గితే సహజ సిద్ధంగా ఉండే పండు వాసన తెలుస్తుంది. ఇక వీటితో వంటకాలు చేస్తే చుట్టు పక్కల వారికి సువాసన గుప్పుమంటుంది. ఒక్కసారి ఈ వంటకాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.

తాటిపండు ఆరోగ్యకరమే



తాటిపండులో ఎన్నోరకాల ఆరోగ్యకరమైన పోషకాలున్నాయి. ఏ, సీ విటమిన్లతో పాటు బీ కాంప్లెక్స్ పుష్కలంగా లభిస్తుంది. ఎక్కువ పీచుపదార్థం కావడంతో జీర్ణకోశ వ్యాధులు, మలబద్ధకం దూరం అవుతాయి. అంతేగాక రక్తాన్ని శుద్ధి చేసి మెదడుకు గ్లూకోజ్‌ను అందిస్తుంది.

– డాక్టర్ ఎస్.సుదీప్తి, పీపీ యూనిట్ వైద్యులు, పెద్దాపురం

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి

జగ్గంపేట: నియోజకవర్గంలోని క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా నాయకుడు పులి ప్రసాద్ ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు శనివారం జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాన్ వెస్లీ జగ్గంపేట కో ఆప్షన్ మెంబర్‌గా, క్రిస్టియన్ మైనారిటీ జోనల్ ఇంచార్జిగా, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నత పదవులు అలంకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్.జార్జిబాబు, పాస్టర్స్ కుమార్ పాల్, ఐ.సుదర్శన్, దళిత నాయకులు వల్లూరి సత్యానందం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఏలేశ్వరం బాలాజీ చౌక్ ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం, విష్ణుసహస్ర, లలితాసహస్ర నామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. చినజీయర్ స్వామి శిష్యురాలు వాగు రోహిణి భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తివైభవం, విష్ణు వైభవంపై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, తూమురౌతు గురయ్య తదితరులు పాల్గొన్నారు.